క్లుప్తంగా

అతి వేగంగా నడుపొద్దు


తనిఖీ చేస్తున్న ఎస్సై సాయికుమార్

లోకేశ్వరం: వాహనాలను అతి వేగంగా నడిపితే కఠిన చర్యలు తప్పవని లోకేశ్వరం ఎస్సై సాయికుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని మన్మద్ ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు తమ వెంట అన్ని పత్రాలను ఉంచుకోవాలన్నారు. మద్యం సేవించి నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కేజీవీల్స్ ట్రాక్టర్లను రోడ్లపై నడిపితే వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

తాళసప్తాహం ప్రారంభం

కుభీర్: మండలంలోని పార్డి(బి)లో శ్రీరాజరాజేశ్వర మందిరంలో ఆదివారం తాళసప్తాహం ప్రారంభమైంది. ఏడు రోజులపాటు సాగే కార్యక్రమంలో నిత్యం భజనలు, అన్నదానం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఎంపీపీ లక్ష్మిబాయి, సర్పంచ్ పుష్ప, ఆలయ కమిటీ అధ్యక్షులు వి.మోహన్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, సురేశ్, సంతోశ్, బాబు తదితరులు ఉన్నారు.

యాదవ సంఘం కార్యవర్గం


నూతన కార్యవర్గం

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణ యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా దాసరి నడ్పిపోసులు, ప్రధాన కార్యదర్శిగా రాపెల్లి రాజు, ఉపాధ్యక్షుడిగా వేల్పుల అశోక్, కోశాధికారిగా దాసరి రమేశ్, ప్రచార కార్యదర్శిగా రాపెల్లి వెంకటేశ్, కొలకాడుగా నాగుల శిక్కం, సలహాదారుగా రాపెల్లి రాజు, కార్యవర్గ సభ్యుడిగా మూడికె నారాయణ, గౌరవ అధ్యక్షులుగా దాసరి సంతోశ్, బోడ చిన్న భీమన్న ఎన్నికైనట్లు సభ్యులు తెలిపారు.

భీమన్న ఆలయంలో పూజలు

తానూరు: మండలంలోని ఎల్వి గ్రామ గుట్ట ప్రాంతంలో ఉన్న భీమన్న దేవుడికి నాయక్‌పోడ్ కులస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఏటా మాదిరి ఈసారి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలిచ్చారు. ఆలయంలో నైవేద్యం సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. వర్షాలు కురిసి పంటలు పండాలని వేడుకున్నారు. నాయక్‌పోడ్ సంఘం నాయకులు బాబన్న, నర్సింలు ,భూమన్న, సాయన్న, కృష్ణ, నర్సయ్య ఉన్నారు.

గ్రామదేవతలకు బోనాలు


పొట్టపెల్లిలో జలం తీసుకొస్తున్న ప్రజలు

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి, వడ్యాల్, లక్ష్మణచాంద, పార్‌పెల్లి, పీచర త దితర గ్రామాల్లో ఆదివారం గ్రామదేవతలకు బోనాల పండుగ నిర్వహించారు. పీచర సమీపంలోని గోదావరి నది జలాలను ఊరేగింపుగా తీసుకొచ్చి దేవతలకు అభిషేకం చేశారు.

'మాజీ సైనికులకు స్థలం కేటాయించండి'


ఎమ్మెల్యేను కలిసిన మాజీ సైనికులు

భైంసాటౌన్: తమ ప్రత్యేక కార్యాలయం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని పలువురు మాజీ సైనికులు ఆదివారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. పట్టణంలో స్థలం కేటాయిస్తే మాజీ సైనికుల కోసం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. ఆకుల గోపాల్, పిప్పెర మహేందర్, హన్మాండ్లు, మల్లేశ్వర్, లక్ష్మణ్, కార్తీక్, సంతోష్, తదితరులున్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్, గోసంపల్లితోపాటు ఆయా పంచాయతీల పరిధిలోని నడింపల్లె, ఒడ్డెవాడ గ్రామాల్లో ఆదివారం బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు భూక్య జాన్సన్‌నాయక్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు ప్రశాంత్‌రెడ్డి, మోహన్, కరిపె సాయిరాజ్, బొజ్జ అనిల్, రఘు, బిల్ల రమేశ్, ఎల్లయ్య, కృష్ణగౌడ్, నర్సయ్య, మహేశ్, శంకర్, రాజేశ్, కిరణ్, నవీన్, ప్రసాద్, వంశీ, అరవింద్‌తో పాటు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కడెం జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో శ్రావణ్, వీరేశ్, పాల సంతోశ్, సాబీర్, చిప్ప దేవన్న, మాన్క రమేశ్, ధర్మపురి, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

కస్తూరిబాలో కష్టాలు

- బెంచీల్లేక.. నేలపైనే విద్యార్థినుల చదువులు
- గదులకు తలుపులు, కిటికీలు కరువు
- సరిపడా లేని మరుగుదొడ్లు, స్నానాలగదులు
- ఇబ్బంది పడుతున్న బాలికలు
- పట్టించుకోని అధికారులు


ఆరో తరగతిలో బెంచీల్లేక కింద కూర్చొని పాఠాలు వింటున్న విద్యార్థినులు


పెచ్చులు లేవడంతో నిరుపయోగంగా స్నానాల గది


కిటికీకి తలుపు లేకపోవడంతో ఏర్పాటు చేసిన దుప్పటి


గ్యాస్ లేక కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న నిర్వాహకులు

తానూరు: పేద బాలికలకు నాణ్యమైన విద్య, వసతి అందించాలనే ఉద్దేశంతో కస్తూరిబా(కేంద్ర బాలికల విద్యాలయం)లను ఏర్పాటు చేసింది. కానీ అధికారుల పర్యవేక్షణ లోపంతో మండల కేంద్రంలోని కస్తూరిబాలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రమైన తానూరుకు కిలోమీటర్ దూరంలో పదేళ్ల కిందట రూ.54 లక్షలతో కస్తూరిబా భవనం నిర్మించారు.గదుల కొరత లేకున్నా కనీస సౌకర్యాలు కరువయ్యాయి.

సరిపడ బెంచీల్లేవ్..

కస్తూరిబాలో మొత్తం 250 మంది విద్యార్థులు ఉన్నారు. సరిపడ బెంచీలు లేకపోవడంతో 6,7వ తరగతుల విద్యార్థులు నేలపైనే కూర్చొని పాఠాలు వింటున్నారు. ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు కూడా సరిపడ బెంచీల్లేక కొందరు కిందనే కూర్చొని వింటున్నారు.

బారులు తీరుతున్న విద్యార్థినులు..

250 మంది విద్యార్థులున్న పాఠశాలలో ఆరు మరుగుదొడ్లు ఉండగా రెండు.. ఏడు స్నానాల గదులు ఉండగా రెండు గదులు పని చేయడం లేదు. దీంతో విద్యార్థినులు స్నానాలు, కాలకృత్యాలు తీర్చుకునేందుకు బారులు తీరుతున్నారు. ప్రస్తుతం పని చేస్తున్నవి కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. పాఠశాలలో మురికి కాలువల నిర్మాణం లేక వర్షపు నీరు నిలిచి పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారుతోంది. దీంతో రోగాల బారిన పడుతున్నామని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో శుద్ధజల యంత్రం నిరుపయోగంగా మారింది. దీంతో రోజు విద్యార్థులకు బయట నుంచి మినరల్ వాటర్ తీసుకొస్తున్నారు. పాఠశాలలో సిలిండర్లు లేకపోవడంతో నిర్వాహకులు కట్టెలపొయ్యిపైనే వంట చేస్తున్నారు. దీంతో గదులలో పొగ చేరి విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిర్మాణంలో లోపించిన నాణ్యత..

కస్తూరిబా భవన నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నాణ్యత లేని తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లోని తరగతి గదులకు, భోజనశాలకు, హెచ్‌ఎం, స్టాఫ్ కార్యాలయాలకు కిటకీలు, తలుపులు పూర్తిగా ఊడిపోయాయి. దీంతో విద్యార్థినులు చలి, ఈదురుగాలుల నుంచి రక్షణ పొందేందుకు కిటకీలకు దుప్పట్లు ఏర్పాటు చేసుకున్నారు. భారీ వర్షం కురిస్తే కిటికీల నుంచి గదుల్లోకి నీరు చేరుతోందని విద్యార్థినులు వాపోతున్నారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణత..

గత రెండేళ్లలో పదో తరగతి ఫలితాల్లో కస్తూరిబా విద్యార్థినులు వందశాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు మండలంలోనే ప్రథమస్థానంలో నిలిచారు. ఆట పరికరాలున్నా.. మైదానం లేకపోవడంతో ఆటలకు దూరం ఉంటున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు..

ఈనెల 7న కస్తూరిబాలో నోట్‌బుక్‌ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి పాఠశాలలోని సమస్యలు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

స్నానం కోసం బారులు



పాఠశాలలో సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేవు. దీంతో రోజు తెల్లవారుజామున ఐదు గంటల నుంచే స్నానాల కోసం బారులు తీరుతున్నాం. ఇబ్బంది అవుతుంది. అదనంగా మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించాలి.

– భాగ్యశ్రీ, తొమ్మిదో తరగతి

నేలపైనే కూర్చొంటున్నాం



ఆరో తరగతిలో బెంచీల్లేక కింద కూర్చొంటున్నాం. బెంచీలు ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– రుతుజా, ఆరో తరగతి

సమస్యలు పరిష్కరిస్తాం

తానూరు కస్తూరిబాలో సమస్యలు మా దృష్టికి వచ్చాయి. మరుగుదొడ్లు, స్నానపు గదులు, కిటకీలు, తలుపుల ఏర్పాటు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరవగానే పనులు చేపడుతాం. ప్రస్తుతం విద్యార్థులు ఇబ్బంది పడకుండా తాత్కాలికంగా చర్యలు తీసుకుంటాం.


– శ్రీదేవి, సెక్టోరియల్ అధికారిణి

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	110
వంకాయ	70
బెండకాయ	70
పచ్చిమిర్చి	120
కాకరకాయ	100
బీరకాయ	110
క్యారెట్	120
గోరుచిక్కుడు	50
కొత్తిమీర	120
అల్లం	200
ఎల్లిగడ్డ	140
ఉల్లిగడ్డ	30
ఆలుగడ్డ	40

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : రంగబలి
నారాయణ : సామజవరగమన

సీతక్క జన్మదిన వేడుకలు

కడెం: మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ములుగు ఎమ్మెల్యే సీతక్క జన్మదిన వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల మల్లేశ్ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో రఫీక్, వాజీద్, భూషణం, బబ్లూ తదితరులు ఉన్నారు.

సందడిగా బోనాల వేడుకలు


బోనంతో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, అమ్మవారికి పట్టువస్త్రాలు తెస్తున్న జగన్మోహన్‌రెడ్డి


కుంటాలలో బోనాలతో మహిళలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ నందిగుండం దుర్గామాత ఆలయంలో బోనాల వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయం వద్దకు వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ చైర్మన్ లక్కిడి జగన్మోహన్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

కుంటాలలో..

కుంటాల: మండలకేంద్రంలోని మహాలక్ష్మి ఆలయ 17వ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్లకు నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో జీవీ శ్రీనివాస్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు గంగాధర్‌గౌడ్, నరేందర్‌గౌడ్, ప్రకాశ్‌గౌడ్, రమేశ్‌గౌడ్, రామ్‌నాథ్‌గౌడ్, నర్సాగౌడ్, కృష్ణకాంత్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన విద్యార్థులు

ముధోల్: మండల కేంద్రంలోని రబీంద్ర పాఠశాలలో ఆదివారం ఆషాఢ బోనాల పండుగ నిర్వహించారు. విద్యార్థినులు బోనాలు ఎత్తుకొని పండుగలో పాల్గొన్నారు. బోనాల పండుగ విశిష్టతను ప్రిన్సిపాల్ విద్యార్థులకు వివరించారు.

ధర్మారంలో..

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారంలో మహాపోచమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

ఘనంగా ఈదమ్మ పండగ

భైంసారూరల్: మండలంలోని వాలేగాం గ్రామంలో ఆదివారం రజకులు ఘనంగా ఈదమ్మ పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం సభ్యులు ధోబీఘాట్ వద్ద ఈదమ్మ గాదెకు ప్రత్యేక పూజలు చేసి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని మొక్కుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు గంగాధర్, రాములు, లక్ష్మణ్, శ్రీనివాస్, సాయినాథ్, లింగం, నారాయణ, నర్సయ్య, లస్మన్న, విజయ్ పాల్గొన్నారు.



ముధోల్ రబీంద్ర పాఠశాలలో విద్యార్థులు


వాలేగాంలో పూజలు చేస్తున్న భక్తులు

స్వచ్ఛంద ఉద్యోగ విరమణ అభినందనీయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: సామాజిక సేవ కోసం తన భర్త అజ్మీరా శ్యాంనాయక్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేయడం అభినందనీయమని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎల్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన స్వచ్ఛంద పదవీ విరమణ మహోత్సవానికి వారు హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా పలు సంఘాలతోపాటు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులు హాజరై శ్యాంనాయక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అంకం రాజేందర్, పుప్పాల శంకర్, రామునాయక్, మోహిద్, వెంకాగౌడ్, సతీశ్, చంద్రశేఖర్, గంగారెడ్డి, రాజగంగన్న, చరణ్ తదితరులున్నారు.

ఉత్తమ ఫలితాలకు ప్రశంసపత్రం


ప్రశంసా పత్రం అందుకున్న నరేశ్

నిర్మల్‌ఖైగేట్: ఇటీవల పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఫలితాలు సాధించినందుకు శ్రీ సరస్వతీ శిశు మందిర్ బుధవార్‌పేట నిర్మల్ ప్రధానాచార్యులు కొండూరు నరేశ్‌కు ప్రశంసాపత్రం అందించి సన్మానం చేశారు. తెలంగాణ ప్రాంత వర్షారంభ సమావేశాలలో భాగంగా శ్రీ సరస్వతీ విద్యా పీఠం శ్రీ శారదాధామం హైదరాబాద్‌లో దక్షిణ మధ్య క్షేత్ర అధికారులు పసర్తి మల్లయ్య చేతుల మీదుగా ప్రశంసపత్రం అందజేశారు.

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లీ శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించారు. ఈమేరకు పాఠశాల ప్రధానాచార్యులు నామాల భోజన్నకు ఉత్తమ పురస్కారం లభించింది. ఆదివారం హైదరాబాద్‌లోని విద్యాపీఠంలో వర్షారంభ సమావేశంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను శాలువాతో సత్కరించి ప్రశంసపత్రం అందించారు. పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు, ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.

నేటి ధర్నాకు తరలిరావాలి


మాట్లాడుతున్న సుధాకర్

ఖానాపూర్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని.. ఈనెల 10న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాకు కార్మికులు తరలిరావాలని తెలంగాణ గ్రామపంచాయతీ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్ అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష నాలుగో రోజుకు చేరింది. దీక్షకు మద్దతు బైఠాయించి మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేసి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం నూతన్, పోశెట్టి, గంగాధర్, స్వామి, నర్సయ్య, ముత్తన్న, ఆశన్న, లక్ష్మి, రాజవ్వ, తదితరులున్నారు.

గుంతల పూడ్చివేత


బాసరలో గుంతలు పూడ్చివేయిస్తున్న సభ్యులు

భైంసా: బాసర బస్టాండ్‌లో రోడ్డుపై ఏర్పడిన గుంతలను శారద ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛందంగా పూడ్చివేశారు. గుంతల్లో వర్షపునీరు నిలుస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ట్రాక్టర్ యూనియన్ సభ్యులు ముందుకొచ్చి గుంతలు పూడ్చివేశారు.

సాగు పనుల్లో బిజీ బిజీ



జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. కొందరు రైతులు కమ్మరుల వద్దకు వెళ్లి వ్యవసాయ పనిముట్లు తయారు చేయిస్తుండగా మరికొందరు కూలీలతో వెళ్లి చేన్లలో కలుపు మొక్కలు తొలగిస్తున్నారు. నిర్మల్‌రూరల్ మండలంలోని ఆయా గ్రామాల్లో తీసిన దృశ్యాలివీ.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్





జర్నలిస్ట్ యూనియన్ కార్యవర్గం

ఖానాపూర్: ఖానాపూర్ మండల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పడాల లక్ష్మీనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సిరిపురం నాగరాజు, గౌరవ అధ్యక్షుడిగా రాచమల్ల రాజశేఖర్, సమన్వయకర్తగా మంత్రరాజం దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా కొమటిపెల్లి గోపి, కోశాధికారిగా దాసరి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా పుప్పాల శేఖర్, అలీంఉద్దీన్, పల్లెర్ల శ్రీనివాస్, తిరుక్కొవెల ప్రవీణ్, తొవిటి శంకర్, సహాయ కార్యదర్శులుగా బండపాటి సంతోశ్, మదిరె శ్రీనివాస్, రఫీక్‌బాబా, కారింగుల రుత్విక్, ద్యావతి గంగాధర్, న్యాయ సలహాదారుగా గాంధారి నరేంద్రనాథ్, ముఖ్య సలహాదారులుగా అల్వాల శ్రీనివాస్, లక్ష్మణ్, నరేశ్, ప్రశాంత్, కృష్ణస్వామిని ఎన్నుకున్నారు.

విద్యార్థులకు సన్మానం


పూజితను సన్మానిస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన రవీందర్ కూతురు మస్కాపూర్ జెడ్పీఎస్ఎస్ విద్యార్థిని బల్సు పూజిత పదో తరగతి చదివి ఇటీవల బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఈ మేరకు ఆదివారం తిమ్మాపూర్ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు.

కుంటాల: కుంటాలకు చెందిన సింధు–ఆకాష్ దంపతుల కుమారుడు శివకుమార్ రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ ఐఐటీలో సీటు సాధించాడు. ఈ మేరకు ఆదివారం కుంటాలలో అయ్యప్ప సేవా సమితి సభ్యులు విద్యార్థిని సన్మానించి అభినందించారు. జక్కని గజేందర్, ఉదయ్, హరిప్రసాద్, సంజీవ్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులకు సన్మానం


సన్మానంలో నాయకులు

కుంటాల: మండలంలోని లింబా(కే) గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగులు కట్కం దయాసాగర్, అల్లాడి రాకేశ్ ఉద్యోగ విరమణ పొందారు. గ్రామానికే చెందిన ఉపాధ్యాయులు కట్కం గంగాధర్, శంకర్ ఇటీవల దశాబ్ది ఉత్సవాల్లో పురస్కారాలు అందుకున్నారు. వీరితోపాటు ఇటీవల ఉద్యోగం సాధించిన విఠల్, గోనె వినాయక్, సిందే జయవంత్‌రావుతో పాటు పీహెచ్‌డీ పట్టా సాధించిన ఎండీ కలీంలను ఆదివారం గ్రామంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. అధ్యక్షులు ఏనుగు బాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి సిందే దత్తురాం, కోశాధికారి వినాయక్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు జలపతిరెడ్డి, ఆదిరాజన్న, వెంకట్‌రెడ్డి, మల్లేశ్, సాయినాథ్, అడెల్లు, ముత్యంరెడ్డి, ప్రవీణ్, ప్రదీప్, అన్వేష్, శంకర్ తదితరులు ఉన్నారు.